క్లుప్తంగా

ప్రాథమిక బడులకు ఎల్ఈడీ పాఠాలు



ఎల్ఈడీ టీవీ అందజేస్తున్న సీఆర్పీలు

బొంరాస్‌పేట: ప్రాథమిక బడుల్లో ఎల్ఈడీ ద్వారా పాఠాలు బోధించనున్నారు. దీని కోసం పలు ప్రాథమిక పాఠశాలలకు ప్రభుత్వం ఎల్ఈడీ టీవీలు పంపించింది. శుక్రవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో సీఆర్పీలు ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేశారు. డిజిటల్ పాఠాలతో విద్యార్థులను ఆకట్టుకునే స్థాయిలో బోధన చేపట్టనున్నట్లు హెచ్ఎంలు తెలిపారు. ఇందులో సీఆర్పీలు సోమ్లా, శంకరయ్య, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎన్నికలు నిర్వహించే ఆలోచనే లేదు

బీఆర్ఎస్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్



మాట్లాడుతున్న మహిపాల్ తదితరులు

దౌల్తాబాద్: కాంగ్రెస్‌కు ఎన్నికలు నిర్వహించే ఆలోచనే లేదని బీఆర్ఎస్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే ఇవ్వడంతో ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికలతో పావులాట ఆడుతుందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లను గందరగోళంగా కేటాయించి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేశ్, కాశప్ప, మల్కరాజు, సంతోశ్, బాలరాజు, దస్తప్ప, సాయిలు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలి

కుల్కచర్ల: మండల కేంద్రంలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కుల్కచర్ల మాజీ ఉపసర్పంచ్ పండరయ్య, మాజీ వార్డుసభ్యులు మోత్కూరు వెంకటేశ్ కోరారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుల్కచర్ల మండల కేంద్రంలో విద్యుత్ సమస్య ఉందని, ప్రతిరోజు ఉదయం లోఓల్టేజీగా మారుతుందన్నారు. కొంతకాలంగా గ్రామ పరిధిలోని 6వార్డులు ఈ సమస్య ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే స్టే

బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్

అనంతగిరి: ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల జీవో నంబర్ 9పై స్టే ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బీఆర్ కృష్ణ ముదిరాజ్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదనలు శాస్త్రీయమైనవి, సమగ్రమైనవి కాకపోవడంతో బీసీల ఆత్మగౌరవానికి అవమానం జరిగిందని, వారి రాజకీయ భవిష్యత్‌ను బజారుపడేలా చేసిందని ఆయన విమర్శించారు. తక్షణమే 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని, హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో శాస్త్రీయమైన, సమగ్ర వాదనలు వినిపించేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు.

టీవీవీ సేవలు అభినందనీయం

జిల్లా విద్యా అధికారి రేణుకాదేవి



స్పోర్ట్స్ మెటీరియల్స్‌ను ఎంఈఓ రాంరెడ్డికి అందజేస్తున్న డీఈఓ రేణుకాదేవి

కొడంగల్ రూరల్: టీవీవీ సేవలు అభినందనీయమని జిల్లా విద్యా అధికారి రేణుకాదేవి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న బుక్ బైండింగ్ శిక్షణ తరగతులను ఆమె పరిశీలించారు. అనంతరం తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్వర్యంలో పాఠశాలకు అందిస్తున్న స్పోర్ట్స్ మెటీరియల్స్‌ను ఆమె ఎంఈఓ రాంరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీవీవీ కన్వీనర్ రవీందర్‌గౌడ్, ఉపాధ్యాయ సిబ్బంది వేణుగోపాల్, అనిల్‌కుమార్, రవి, నరహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీలకు చెక్!



పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)



ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

- ఉపాధి హామీలో పారదర్శకతకు చర్యలు
- ఈకేవైసీతో కూలీల హాజరు నమోదు
- నూతన సంస్కరణలు అమలు చేయనున్న ప్రభుత్వం

దౌల్తాబాద్: ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం నూతన సంస్కరణలను అమలు చేయనుంది. పనుల్లో నకిలీలను అడ్డుకునేందుకు చర్యలు చేపట్టింది. దీనికోసం ఎల్రక్టానిక్ ఎంబీ(ఈ–ఎంబీ), ఈ కేవైసీ విధానాన్ని తీసుకొచ్చింది. పని ప్రదేశంలో వివరాల నమోదు, కూలీల హాజరు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టనుంది. మండలంలో ఈ నెల 1నుంచి ఈఎంబీ, ఈకేవైసీ నమోదు ప్రక్రియను ప్రారంభించారు.

తప్పులకు ఆస్కారం లేకుండా..

గ్రామాల్లో చేపట్టనున్న పనుల వివరాల నమోదుకు ఈ–ఎంబీ (ఎల్రక్టానిక్ మెజర్‌మెంట్ బుక్) విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. పనిచేసే ప్రాంతాల వివరాలను ముందుగా లెక్కించి కొలత పుస్తకంలో రాసి తర్వాత ఆన్‌లైన్, ఈఎంబీలో నమోదు చేయల్సి ఉంటుంది. ఈ వివరాలను ప్రత్యేక యాప్‌తో అనుసంధానిస్తే ఆయా పనుల వివరాలను ఎప్పుడైనా చూసుకోవచ్చు. దీంతో ఒకే చోట రెండు పనులు చేయడం వంటి తప్పిదాలకు ఆస్కారం ఉండదు.

> **జాబ్‌కార్డు ఉన్న కూలీల వివరాల సేకరణ**
> మండలంలో అన్ని గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్న కూలీల వివరాలను ఈకేవైసీ చేయిస్తున్నాం. ఈ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో ఎఫ్ఏలకు, టీఏలకు ఈ విధానం గురించి అవగాహన కల్పించాం.
> – అంజిలయ్య, ఏపీఓ, దౌల్తాబాద్

పనిప్రదేశం వద్ద..

పని ప్రదేశం వద్ద కూలీల హాజరును నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్‌లో అప్లోడ్ చేసేవారు. కానీ క్షేత్రసహాయకులు, మేట్లు నకిలీ ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నట్లు గుర్తించారు. సామాజిక తనిఖీల్లో అక్రమాలు బయటపడడంతో వీటిని అరికట్టేందుకు కేంద్రం ఎన్ఎంఎంఎస్ యాప్‌ను తీసుకొచ్చింది. దీనిని కూడా దుర్వినియోగం చేస్తున్నట్లు గ్రహించారు. దీంతో నకిలీల హాజరు నమోదును అరికట్టేందుకు ఈ కేవైసీ విధానమే సరైనదని భావించి తీసుకొచ్చారు. మండలంలో ఈకేవైసీ నమోదు ప్రక్రియ జరుగుతుంది. అది పూర్తవ్వగానే అమలులోకి తీసుకొస్తారు. దీని ప్రకారం పనులకు వచ్చిన కూలీల ఫొటోలను ఫోన్‌లో తీసి అప్‌లోడ్ చేస్తారు. నాలుగు గంటల తర్వాత మరోసారి ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తారు. ఒకే వ్యక్తి రెండు సార్లు ఫొటో దిగి అప్‌లోడ్ చేయిస్తే కూలీ డబ్బులు విడుదల కావు. నకిలీల నివారణతో ప్రభుత్వ ధనం వృథా కాదు.

వేతనాలు విడుదల చేయండి

ఆదర్శ పాఠశాల సిబ్బంది వినతి



ప్రిన్సిపాల్ అనీలకు వినతిపత్రం ఇస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది

బషీరాబాద్: బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఆదర్శ పాఠశాల సిబ్బంది ప్రభుత్వాన్ని కోరారు. సకాలంలో వేతనాలు చెల్లించకున్నా పస్తులుండి పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 8 నెలలుగా వేతనాలు చెల్లించకుండా సర్కారు వెట్టిచాకిరి చేయిస్తుందని మండిపడ్డారు. గురువారం లంచ్ బ్రేకులో పీడీ నరేశ్, కంప్యూటర్ ఆపరేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, అటెండర్ లక్ష్మణ్, నైట్ వాచ్‌మెన్ బీరప్ప పాఠశాల ప్రిన్సిపాల్ అనీలకు వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని 9 మోడల్ స్కూళ్లలో ఔట్ సోర్సింగ్ కింద కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, వాచ్ మెన్లుగా 39 మంది పనిచేస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించి వెంటనే వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సామాజిక అంశాలపై అవగాహన తప్పనిసరి



కూరగాయల ప్రదర్శనలో విద్యార్థులతో ఎంఈఓ హబీబ్ అహ్మద్

మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్

కుల్కచర్ల: విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక అంశాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని కుల్కచర్ల మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ఓ ప్రవేట్ పాఠశాలలో పౌష్టికాహారంలో కూరగాయల పాత్ర, ఉపయోగాలు, మార్కెట్ నిర్వహణ అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యారెడ్డి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలు అదుపు

- సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పులిందర్ రెడ్డి
- గౌరారం ప్రధాన కూడలిలో ఏర్పాటు



గౌరారం ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా వద్ద గ్రామస్తులు

దుద్యాల్: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు అదుపు చేయొచ్చని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పులిందర్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గౌరారంలో శుక్రవారం రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ కెమెరాలు ఉండడం వల్ల ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దోపిడీ, దాడులు వంటి సంఘటనల్లో సాక్ష్యంగా పనిచేస్తాయన్నారు. అనుమానాస్పద వ్యక్తులు గ్రామంలోకి చొరబడినప్పుడు వారిని గుర్తించేందుకు ఇవి దోహదపడుతాయన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించిన పులిందర్ రెడ్డిని దుద్యాల్ ఎస్ఐ యాదగిరి, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ముఖ్య నాయకుడు సీసీ వెంకటయ్య, కావలి అంజిలయ్యలు తదితరులు పాల్గొన్నారు.

హిందూ సామాజిక వర్గాలకే వర్తించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ నాయకుల డిమాండ్

బొంరాస్‌పేట: హిందూ సామాజిక వర్గాలకే 42శాతం రిజర్వేషన్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని, ఇతర మతస్తులను చేర్చొద్దని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నికల అధికారికి బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ఆర్భాటం కోసమే రిజర్వేషన్ అంశాన్ని తీసుకొచ్చి హంగామా సృష్టించిందని విమర్శించారు. కోర్టులు, వాయిదాల పేరిట బీసీలను అవమాన పర్చడమే తప్ప వేరే ఉద్దేశమేది లేదన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బాబయ్యనాయుడు, జగదీశ్, దశరథ్, శ్రీనివాస్, వీరశైవ సంఘం మండలాధ్యక్షుడు తదితరులు ఉన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ను బొంద పెడుతాం

బషీరాబాద్: బీసీలు రాజకీయంగా ఎదగొద్దనే ఆలోచనతోనే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రిజర్వేషన్లను అడ్డుకున్నాయని బషీరాబాద్ మండల బీసీ ముఖ్య నాయకులు మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీలను బీసీ ఓటర్లు బొంద పెట్టడం ఖాయమని జోస్యం చెప్పారు. గురువారం బషీరాబాద్ బీసీ సీనియర్ నాయకులు అజయ్‌ప్రసాద్, వెంకటేష్ మహరాజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కలాల్ నర్సిములు, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు వేరువేరు ప్రకటన్‌లో మండిపడ్డారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

దుద్యాల్: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని దుద్యాల్ పోలీసులు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హకీంపేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..డ్రగ్స్, గంజాయి వంటి పదార్థాలు తీసుకోవడం ద్వారా వాటికి బానిసగా మారే అవకాశం ఉంటుందన్నారు. వీటి వినియోగంతో ఆరోగ్యం క్షీణించి మృత్యువాత పడతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణ కుమారి, అధ్యపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కీటక నియంత్రణ పరికరాలు వినియోగించాలి

మండల వ్యవసాయాధికారి తులసి



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి తులసి తదితరులు

కొడంగల్ రూరల్: రైతులు స్టిక్కీ ట్రాప్స్(జిగురు అట్టలు), ఫెరోమోన్ ట్రాప్స్ వినియోగంతో పంటలను సంరక్షించుకోవాలని మండల వ్యవసాయాధికారి జి తులసి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఉడిమేశ్వరం గ్రామ శివారులోని పత్తి, కంది, వరి తదితర పంటలను పరిశీలించారు. కీటక నియంత్రణ పరికరాలను వినియోగిస్తూ అధిక దిగుబడులు సాధించాలని పేర్కొన్నారు. పంటలపై దాడి చేసే చీమలు, తెల్ల దోమలు, త్రిప్స్ వంటి పురుగులను ముందుగానే గుర్తించి ఆయా పరికరాలతో నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ) ఐసాక్ హెరాల్డ్, రైతులు శ్రీనివాస్, మోహన్, మోహన్‌రెడ్డి, రాములు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల అందజేత



ప్యాడ్‌లు అందజేస్తున్న గ్రామస్తులు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఎన్కేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన సంగెం అంజి ప్రథమ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు పలు వస్తువులు, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. అలాగే గ్రామంలోని పేదలకు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. పలుబోట్ల గ్రామంలో సామూహిక సిమెంటు కుర్చీలు ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మహేశ్‌కుమార్, ఉపాధ్యాయులు జ్యోతిపరమేశ్వరి, కుటుంబ సభ్యులు సంగెం లక్ష్మి, ఆరాధ్య, ఆర్యన్, వెంకటయ్య, లక్ష్మమ్మ, అంజమ్మ, శివాజీ యువజన సంఘం అధ్యక్షుడు సంగెం రవి పాల్గొన్నారు.

రేషన్ డీలర్ రాజీనామా

శంకర్‌పల్లి: పట్టణంలోని 18వ రేషన్ దుకాణ దారుడు అనంతయ్య అనారోగ్య కారణాలతో తన డీలర్‌షిప్‌ని వదులుకోనున్నట్లు చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళకు ఇటీవల రాజీనామా పత్రాన్ని అందించారు. ఈ మేరకు ఆర్డీఓ తుది నిర్ణయం తీసుకుని రాజీనామాని ఆమోదించారు.

సర్వతోముఖాభివృద్ధికి ఆరోగ్యం కీలకం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కొడంగల్ రూరల్: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి శారీరక, మానసిక ఆరోగ్యం ఎంతో కీలకమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహన దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల వృక్షశాస్త్ర విభాగం, యూఅండ్‌మి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో బహుమతులు అందించనున్నారని తెలిపారు. సామాజిక మాధ్యమాల ప్రభావం వల్ల విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపలేకపోతున్నారన్నారు. విద్యార్థి దశ ఎంతో ప్రధానమైనదని, సరైన లక్ష్యాన్ని ఎంచుకొని విజయం సాధించేందుకు కృషిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానమ్, అధ్యాపకులు టి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజాసింగ్‌పై కేసు నమోదు చేయండి

ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ముస్లిం నాయకులు

ధారూరు: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై కేసు నమోదు చేయాలని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి..గాంధీ జయంతి సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో నిర్వహించిన సమావేశంలో మహ్మద్ ప్రవక్త, ముస్లింలను అవమానిస్తూ మాట్లాడారన్నారు. ఈ విషయంలో అతని మాటలు మత విద్వేశాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని పోలీసుల దృష్టికి తెచ్చారు. వెంటనే ఈ విషయంలో ఆయనపై కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జామ మసీద్ కమిటీ అధ్యక్షుడు ఉమర్, ఎంఐఎం నాయకులు మోయిజ్‌ఖురేషి, అబ్దుల్‌రహీంఖురేషి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం అవసరం



పరిగి: మాట్లాడుతున్న వెంకటేశ్వరి

తహసీల్దార్ వెంకటేశ్వరి

పరిగి: ప్రభుత్వ పనితీరు బలోపేతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం అవసరమని తహసీల్దార్ వెంకటేశ్వరి సూచించారు. ఆర్టీఐ వారోత్సవాల్లో భాగంగా అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీఐ చట్టాలు, ప్రజలకు పారదర్శకత, బాధ్యత కలిగిన పరిపాలనను అందిస్తాయని తెలిపారు. ప్రతి పౌరుడు ఆర్టీఐని వినియోగించుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంతమైన ఆయుధమని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డి ప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్ల: పౌరులందరూ సమాచార హక్కుచట్టంపై అవగాహన పెంపొందించుకోవాలని కుల్కచర్ల తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించి ప్రజలకు గల హక్కులను వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్, గిర్దవరులు ఖాజ, రవి, పాల్గొన్నారు.

చౌడాపూర్ మండలంలో..

చౌడాపూర్ మండల కేంద్రంలో తహసీల్దార్ వాహిదాఖాతుం సమాచారహక్కు చట్టంపై అవగాహన నిర్వహించారు. ప్రతిఒక్కరూ చట్టంలోని హక్కులు, విధులు, నిబంధనలను తెలుసుకోవాలని సూచించారు.

శిక్షణతో నైపుణ్యం పెంచుకోవచ్చు

అకాడమిక్ మానిటరింగ్ అధికారులు



శిక్షణ ఇస్తున్న అధికారులు

పరిగి: ఉపాధ్యాయులు శిక్షణ వల్ల నైపుణ్యం మరింత పెంచుకోవచ్చని అకాడమిక్ మానిటరింగ్ అధికారులు శ్రీరామం, మస్తాన్ పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని నంబర్1 ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులకు డిజిటల్ లెర్నింగ్‌పై నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ శిక్షణలో పైథాన్ ప్రొగ్రామింగ్, ప్రాథమిక అంశాలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పకుండా కంప్యూటర్‌లో ప్రాక్టీస్ చేయాలని సూచించారు. ఈ బహుళ ప్రయోజనాలతో కూడిన డిజిటల్ పాఠాలు పిల్లల భవిష్యత్‌కు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కాబట్టి శిక్షణలో నేర్చుకున్న ప్రతీ అంశాన్ని విద్యార్థులకు నేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గోపాల్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల అమలుకు కృషి



యాలాల: మాట్లాడుతున్న నాయకులు

మండల కాంగ్రెస్ నాయకులు

యాలాల: బీసీలపై కాంగ్రెస్‌కి చిత్తశుద్ధి ఉందని, ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలుకు కృషి చేస్తుందని మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రిజర్వేషన్ అమలు కోసం అసెంబ్లీలో ప్రవేశ పెట్టి తీర్మానించించిన విషయాన్ని గుర్తు చేశారు. బీసీల విషయంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కపట ప్రేమ చూపిస్తున్నాయని మండిపడ్డారు. ఈ విషయం గురించి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహించారని గుర్తు చేశారు. బీసీల ఎదుగుదలను ఓర్వలేకే బిల్లు విషయంలో గవర్నర్ ఆమోదం తెలపకుండా పెండింగ్‌లో పెట్టారని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ హన్మంతు, కాంగ్రెస్ బీసీ సంఘం మండల అధ్యక్షుడు అమృతయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం, మత్యకార్మికుల సంఘం నాయకుడు శ్రీధర్, నాయకులు మహిపాల్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: రాష్ట్రంలో బీసీలకు న్యాయం చేసే పార్టీ కేవలం కాంగ్రెస్సేనని యూత్ కాంగ్రెస్ నాయకుడు జగదీశ్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు బీసీలు తగిన బుద్ధి చెబుతారన్నారు.